

# పుణ్యపురుషుడు

- పైడిపాల

జరుగుబాటుంటే తెగులంత సుఖం మరేటి లేదన్నారు. కాలు విరిగి ఆసుపత్రి పాలైన నాకు ఈ మాట నిజమనిపించింది. ఆఫీసు ఫైళ్ళకు, ఫోను కాల్స్‌కు దూరంగా-పరామర్శ కొచ్చే వాళ్ళ కబుర్లతో, కానుకలతో-హాయిగా కాలక్షేప మవుతోంది.

కాలికి కట్టువేసి దాదాపు పదిరోజులు కావస్తోంది. పరిచయస్థులంతా ఒకసారి చూసి వెళ్ళడం పూర్తయింది కనుక, యాక్సిడెంట్ ఎలా అయ్యిందో వివరంగా చెప్పే రికార్డు వినిపించాల్సిన అవస్థ తగ్గింది. అయిన వాళ్ళు మళ్ళీమళ్ళీ వస్తున్నారు. కాని మా కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా కంట్లో నలుసు పడినా, కాల్లో ముల్లు గుచ్చుకున్నా విధిగా పరామర్శించి వెళ్ళే అవతారం ఒక్కసారి కూడా చూడ్డానికి రాకపోవడం నా కాశ్చర్యాన్ని కలిగించింది.

అవతారమంటే మా బంధువో, నా కింది ఉద్యోగో, నా అవసరం ఉన్నవాడో...కాదు. నేను ఈ ఊరు బదిలీ అయివచ్చినపుడు కాక తాళీయంగా తటస్థపడి, వాళ్ళ వీధిలో ఓ అద్దె ఇల్లు చూసి పెట్టడం ద్వారా అప్పుడైన పరోపకారి పాపన్న. ఇంటితో పాటు ఇల్లాలికి అత్యవసరమైన పనిమనిషి, పాలమనిషి, చాకలి మొదలైన సిబ్బందిని కుదిర్చి పెట్టడంతో ఆయన మా ఆవిడకు బాబాయిగా, పిల్లలకు తాతగారుగా ఇంట్లో స్థానం సంపాదించుకున్నాడు. మా ఆవిడ దృష్టిలో అతను పుణ్యపురుషుడు. అతని మాటల్లో నాకు ఆవిడ భక్తే శ్రీరామరక్ష.

వ్యాపారమేదో ఉందంటాడు కాని-నా కెక్కువగా అతను వీధిలోనే కనిపిస్తుంటాడు. అదే విషయం ఒకటి రెండు సార్లు ప్రస్తావిస్తే, అతనూ వేదాంతిలా నవ్వాడు. "వ్యాపారం మా కుర్రాడు చూసుకుంటున్నాడు లెండి. ఈ జానెడు పొట్ట నిండక పోదు. దాని కోసం పెద్ద తాపత్రయపడ్డం నా కిష్టం లేదు ఆఫీసరు గారూ. అంతకీ గడవకపోతే మీ లాంటి వాళ్ళ ఇంటికొస్తే కాదంటారా?" అనేవాడు.

నాకు తెలిసినంత వరకు రాజకీయమైన పదవులేం లేవు కాని అతనికి వీధిలో పెద్దమనిషిగా పేరుంది. కులం, వీధి, మతం....ఇలాంటి కట్టుబాట్ల గురించి అవతారం యెక్కువగా పట్టించుకుంటా డనిపించింది. అతని మాటల ధోరణిని బట్టి ఉత్సవాలు, పూజలు మొదలైన కార్యక్రమాల్లో ముందుండడం కూడా గమనించాను. ఆ వీధిలో చాలా ఉదయాలు అతను ఎర్రటి పట్టు పంచె, ఉత్తరీయంతో కనిపించేవాడు.

కొత్తలో ఒకటి రెండు సార్లు అవతారం ఏకాహమనీ, గుడిలో అభిషేకమనీ చందా కోసం వస్తే- నా కిష్టం లేకపోయినా కాదనలేక పోయాను. కాని ఇటీవల మా వీధిలో కొత్తగా దేవిని ప్రతిష్ఠించామనీ, దేవీ నవరాత్రులు మొదటి సారిగా నిర్వహిస్తున్న సందర్భంగా ఒక ప్రోగ్రాం ఖర్చు నేను భరించాలనీ-చనువుగా అడిగాడు. నాకు చిర్రెత్తి "ఇలాంటి విషయాలలో ఇక నా దగ్గరకు రా"వద్దని నిర్మొహమాటంగా చెపితే మొహం చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయాడు. అదే ఆఖరిసారి-మళ్ళీ కనిపించలేదు.

అవతారాన్ని అలా విదిల్చి కొట్టానని తెలిసి మా ఆవిడ రుసరుసలాడింది. ఆ తర్వాత బొత్తిగా దైవభక్తి లేకుండా అలా చేసినందువల్లే నా కాలు విరిగిందని నొచ్చుకొంది. ప్రాయశ్చిత్తంగా నాకు తెలియకుండా అమ్మవారికి మొక్కే ఉంటుంది కూడా. తర్వాత నేనూ అనుకున్నాను అవతారం లాంటి వాళ్ళ చేత మూర్ఖుడని ముద్ర వేయించుకోకుండా తృణమో పణమో ముట్టజెప్పి పంపించాల్సింది. చివర అన్నదానం లాంటి కార్యక్రమాలు కూడా జరుగుతాయి కదా' ,అని.

"అప్పట్లో నవరాత్రుల హడావిడిలో అవతారం రావడానికి వీలు లేకపోవచ్చు. ఇప్పుడు కార్యక్రమాలు ముగిసినా ఎందుకు రాలేదు? చందా విషయం మనసులో పెట్టుకొని పరామర్శకు రానంత పట్టుదల మనిషి కాదు అవతారం. ఇంతకు ముందు చాలాసార్లు దేవుడి అస్తిత్వం గురించి, రాజకీయాల గురించి నేను వద్దంటున్నావాదం లోకి దించి, తీవ్రంగా పోట్లాడి, మొహం ఎర్రబడి వెళ్ళిపోయి-మర్నాడు మామూలుగా వచ్చి కుశల ప్రశ్నలు వేసేవాడు. అలాంటి అవతారం రాకపోవడానికి కారణం? అవతారం గురించి ఆలోచిస్తుండగా అతనికి బాగా తెలిసిన మనిషి చూడ్డానికి రావడంతో నేను అవతారం గురించి అడిగాను.

"అరె, మీకు తెలియదా? అవతారం జైల్లో ఉన్నాడు" అన్నాడు అతను ఆశ్చర్యపోతూ.

నేను అంత కంటె ఆశ్చర్యపోయాను-అలాంటి పెద్దమనిషి జైలు పాలయ్యాడంటే. నాకు నమ్మకం కుదరలేదు వచ్చినతను వివరాలు చెప్పేవరకూ.

దేవీ నవరాత్రుల నిర్వహణలో అవతారం పడమటి వీధి వాళ్ళతో పోటీ పడ్డాడట. వాళ్ళు హరికథ పెడితే తాను బుర్రకథ, వాళ్ళు నాటకం పెడితే తను రికార్డింగ్ డాన్స్, వాళ్ళు డాన్సు పెడితే తను చవుకబారు సినిమా-ఇలా తలపడి చివరి రోజు జరిగిన గొడవలో అవతలి వాడి తల బద్దలు కొట్టి అవతారం జైలు పాలయ్యాడట.

తూర్పు వీధి దేవికోసం జైలు పాలైన అవతారం 'భక్తి' నా కర్థమయింది. ★